- ఏలూరిపాటి నాగవెంకట సత్యనారాయణమూర్తి

# అగ్నిపునీత

రామేశం, రాజీవల పెళ్లయి మూడేళ్లవుతోంది. ఇప్పుడు 'ఆరోనెల' రాజీవకి. తండ్రి కాబోతున్న రామేశం ఆనందానికి అవధుల్లేవు. సాఫీగా సాగే వారి సంసారంలో ఓ చిన్న 'అల'జడి.

• • •

పరాయివాళ్లకొచ్చే ఉత్తరాలు చదివే అలవాటు లేదు రామేశానికి. భార్య పేరున తన ఆఫీస్ ఎడ్రస్‌కు వచ్చే ఉత్తరాలు కూడా చదవకుండానే భార్యకిచ్చేవాడు. ఆమె చదివి విషయాలు చెప్పేది. అటువంటిది మొన్నటి ఉత్తరాన్ని మాత్రం చదవకుండా వుండలేకపోయాడు. దానికి కారణం-ఫ్రమ్ ఎడ్రస్ 'కృష్ణ' అని వుండడమే. పరుల ఉత్తరాన్ని చదువుతున్నాననే 'తప్పుచేస్తున్న భావన' వున్నా, తన భార్య పరాయిదెలా అవుతుంది అని మనసు చెప్పిన రాజీ ఫార్ములాతో చివరకు ఉత్తరాన్ని చించాడు.

ప్రియమైన రాజీ!

ఎలా వున్నావు? పెళ్లయిన తరువాత మీ ఆయన ధ్యాసలో పడి నీయీ కృష్ణని మరచిపోయావా ఏమిటి? ఎన్నాళ్లయింది నిన్ను చూసి. నీ పెళ్లయిన తరువాత మళ్లీ మనం కలుసుకోలేదు. బైదిబై, మీ ఆయన ఎలా వున్నాడు? మీ ఆయనకి మన గురించి ఎప్పుడైనా చెప్పావా? అంటే మనిద్దరం ఎంత క్లోజ్‌గా వుండేవాళ్లమో, ఎన్ని సినిమాలు క్లాసులెగ్గొట్టి చూశామో అవన్నీను. బహుశా చెప్పివుండవనే అనుకుంటున్నాను. ఎందుకంటే పెళ్లయిన తరువాత 'పతియే ప్రత్యక్ష దైవమన్నట్టు' మీ ఆయన ధ్యాసలో పడిపోయి, నన్నే మరిచిపోయావనుకుంటున్నాను. అప్పుడెప్పుడో నువ్విచ్చిన ఎడ్రస్‌కి రాస్తున్న ఈ ఉత్తరం అందితే జాబు రాయి. నాకింకా ఉద్యోగం రాలేదు. పెళ్లి కాలేదు. షరా మామూలే! వుంటాను.

-నీ కృష్ణ

చదవడం ముగించిన రామేశం మనసు కుతకుతలాడిపోయింది. 'ఎవడీ కృష్ణ?' గత మూడురోజులుగా అంతుచిక్కని ఈ ప్రశ్న మెదడుని దొలిచేస్తుంటే, ఎటూ తేల్చుకోలేక మనోసంఘర్షణ తాలూకు అలసటని మొహంలో కనపడనీయకుండా సాధ్యమైనంతవరకూ మామూలుగా వుండడానికే ప్రయత్నిస్తూ తంటాలు పడుతున్నాడు రామేశం.

ఆఫీసుకొచ్చాడన్నమాటేగాని ఏమాత్రం మనసు లగ్నం కావడం లేదు అతనికి. అసలు ఉత్తరం వచ్చిన రోజునే భార్యని అడిగేద్దామనుకున్నాడు. కాని ఏదో సంకోచం. ఎలా అడగాలో, ఎలా మొదలుపెట్టాలో, ఒకవేళ అడిగినా ఆమె చెప్పేది నిజమో కాదో ఎలా నమ్మడం? అందుకే విరమించుకున్నాడు. అసలు ఆమెకో ఉత్తరం వచ్చినట్టే చెప్పలేదు. ఎలాగైనాసరే ఈ కృష్ణ ఎవరో తనే స్వయంగా కనిపెట్టాలనుకున్నాడు. పెళ్లయిన ఈ మూడేళ్లలో అలాంటి పేరుగల ఫ్రెండ్‌కాని, బావగాని వున్నాడని తన భార్య చెప్పిన దాఖలాలు లేవు.

'ఎలా చెబుతుంది? ఎందుకు చెబుతుంది?' ఎదురు తిరిగింది మనసు. పెళ్లి కాకముందు జరిగిన వ్యవహారాన్ని, పెళ్లయిన తరువాత ఓ ఇల్లాలుగా భర్తకి ఎలా చెపుతుంది? అంటే...అంటే...పెళ్లికి ముందే తన భార్య మరొకరితో ఎఫైర్ నడిపిందా?

అలాంటి ఊహనే భరించలేకపోతున్నాడు రామేశం.

పెళ్లికి ముందే ఎన్నో గ్రంథాలు నడిపి, పెళ్లయ్యాక చక్కగా కాపురం చేసుకుంటున్న ఆడపిల్లలనెందరినో చూశాడు. వాళ్లని చూసినప్పుడల్లా ఈ అమ్మాయి, ఆ అమ్మాయేనా? అనిపించేది.

'పాపం! పూర్‌ఫెలో' అని ఓవిధమైన పిటీని కూడా చూపేవాడు వాళ్ల వాళ్ల భర్తలమీద.

ఇప్పుడు తనుకూడా ఓ పూర్‌ఫెలోయేనా? తన భార్య కూడా పెళ్లికి ముందు ఎఫైర్ నడిపిందా? నడిపే వుంటుంది. లేకపోతే ఈ ఉత్తరం ఎందుకొస్తుంది? కృష్ణట...కృష్ణ...పళ్లు పటపటా కొరికాడు. అనుమానపు పునాది బలంగా పడింది మనసులో. కాని ఎక్కడో మనసులో ఓ మారుమూల ఓ చిన్న ఆశ! తన భార్య అటువంటిది కాదేమోనని.

ఏది ఏమైనాసరే, విషయం ఏమిటో ఆరా తీయాల్సిందే అనుకున్నాడు రామేశం.

• • •

రోజూకంటే ఆలస్యంగా వచ్చిన భర్తని ''ఏమండీ! ఈరోజు ఇంత ఆలస్యమైంది'' గోడమీద వున్న గడియారం వైపు చూస్తూ అడిగింది రాజీవ. సమయం రాత్రి ఏడు గంటలైంది.

రామేశం నుంచి సమాధానం లేదు. భార్యలో ఏనాడూ చూడని ఓ కొత్త వ్యక్తిని చూస్తున్నాడు. ఆమె ప్రశ్నకి జవాబు చెప్పకుండానే లోపలకి వెళ్లిపోయాడు.

గత మూడురోజులుగా భర్తలో వచ్చిన మార్పుని చూసి ఒకింత ఆశ్చర్యపోయింది రాజీవ. భర్త ప్రవర్తనకి మనసులోనే తోచిన కారణాలు వెతుక్కుంటూ వంటింట్లోకి వెళ్లింది కాఫీ కలపడానికి.

పదినిమిషాల తరువాత కాఫీగ్లాసుతో గదిలోకి అడుగుపెట్టిన భార్యని నఖశిఖపర్యంతం ఓమారు పరికించాడు.

పెద్ద అందగత్తె ఏమీకాదు రాజీవ. కాని కనుముక్కు తీరు అన్నీ బాగానే వుంటాయి. మొహంలో అమాయకత్వం, కళ్లలో నిర్మలత్వం ఆమె ప్రత్యేకత.

మనసులో ఏదో ఓమూల భర్యమీద ఒకింత నమ్మకం. కాని అది అనుమానపు పునాదుల్లో పడి కొట్టుమిట్టాడుతున్న వేళ, ఆమెవైపే తదేకంగా చూస్తున్నాడు రామేశం. అప్పటికే ఆరుమాసాలు నిండుతున్నాయేమో, ఏమాత్రం కాస్త పనిచేసినా అలసిపోయినట్లు కనిపిస్తోంది.

ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూండే భర్త మూడీగా మారడంతో ''అలా వున్నారేం? నాతో చెప్పరూ?'' అంటూ చేతిలోని కాఫీగ్లాసు అందించింది. ఎదురుగా వున్న టి.వి ఆన్‌చేసి కూర్చుని అతని భుజంపై తల వాల్చింది.

''ఏమీలేదు'' అన్నాడు పొడిగా.

''ఈరోజు ప్రసారమయ్యే మా యీ వ్యవసాయదారుల కార్యక్రమంలో ముందుగా, చెంబుడు నీళ్లతో

గేదెను కడగడం ఎలా? అన్న అంశంపై పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ పశుపతిగారి వివరణ, ఆపై...'' అంటూ ఇంకా ఏదో చెప్పుకుంటూ పోతోంది. డి.డి-8లో వస్తున్న ప్రోగ్రామ్ అది. ఛానల్ మార్చింది విసుగ్గా. ఏవో సినిమా పాటలు.

ఇవేమీ పట్టనట్టు దీర్ఘాలోచనలో మునిగిపోయిన భర్తను చూసి అడిగింది రాజీవ. ''ఏమండీ! రెండురోజులుగా మీరు అదోలా వుంటున్నారు. రోజూలా నన్ను దగ్గరకు తీసుకోవడం లేదు. నాతో మాట్లాడడం కూడా మానేశారు. ఎందుకు మీరిలా మారిపోయారు? ఏమైందండీ మీకు? నాకు చెప్పరూ ప్లీజ్!'' అంటూ, గెడ్డం పైకెత్తి మరీ ప్రశ్నించిన ఆమె ఇక దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

ఆమె ఎప్పుడూ అంతే!

ఏమాత్రం చిన్న కష్టమొచ్చినా బెదిరిపోయే మనస్తత్వం ఆమెది. భార్య కళ్లల్లో నీళ్లు చూసి చలించిపోయాడు రామేశం. ఆమెను దగ్గరగా తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు ఆప్యాయంగా.

ప్రతీ చిన్న విషయాలకి ఇంతగా కంగారుపడే తన భార్య పెళ్లికి ముందే ఎవరితోనో ఎఫైర్ నడిపిందంటే ఎలా నమ్మడం? నో...ఆమె కన్నీళ్లలో కపటం లేదు. తనపట్ల చూపించే ఆప్యాయతలో కృత్రిమత్వం లేదు. అలాగని, కళ్ల ఎదుట కనిపించే సాక్ష్యాన్ని కాదనలేడు. ఎక్కడో ఏదో తప్పు జరిగింది. అదేమిటో తేలాలి.

''రాజీ''

''ఊ''

''నేనడిగే చిన్న ప్రశ్నకి సూటిగా సమాధానం చెబుతావా?''

''అడగండి ఏమిటది?'' భర్త నుంచి విడిపించుకుని ఆశ్చర్యంగా చూసింది.

ఒక్కక్షణం మాట్లాడలేదు రామేశం. నిజానిజాలను నిగ్గు తేల్చేయమని తొందర పెడుతోంది మనసు.

''నీకు...నీకు...'' గొణిగాడు.

''ఊ..ఏమిటండీ..''

ఇద్దరి మధ్య ఒక్కక్షణం నిశ్శబ్దం.

''నీకు...నీకు...పెళ్లికి ముందే కృష్ణ అనే బోయ్‌ఫ్రెండ్‌తో...ఎఫైర్ వుంది కదూ!''

ఎక్కడో ఆకాశంలో ఆనందంగా ఎగిరే శాంతి కపోతం వైపు విలుకాడు సంధించి వదిలిన బాణంలా, నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చి మరీ గుచ్చుకుందా ప్రశ్న.

''ఏమండీ'' దాదాపు అరచినట్లుగానే అంది. భర్త నుంచి ఇలాంటి ప్రశ్నని ఊహించలేదామె. గత రెండు రోజులుగా భర్తలో వచ్చిన మార్పుకు కారణం ఏమిటో అర్థమైందామెకు.

''చెప్పు రాజీ! చెప్పు..జవాబు కావాలి నాకు'' రెండు చేతులు ఆమె భుజాలపై వేసి కుదిపేస్తూ మరీ అడిగాడు.

''మీకు ఎందుకొచ్చిందండీ అనుమానం?'' నెమ్మదిగా అడిగింది.

''అదంతా ఇప్పుడనవసరం. మన పెళ్లికి ముందు నీకు కృష్ణ అనే బోయ్‌ఫ్రెండ్ వుండేవాడు కదూ! మీరిద్దరూ





సినిమాలకి, షికార్లకి విచ్చలవిడిగా తిరిగారు కదూ! నాకు సమాధానం కావాలి రాజీ!''

మనసులో మండే అగ్నిగోళం ఒక్కసారిగా బ్రద్దలవ్వడంతో ఆవేశంతో ఊగిపోతున్న రామేశాన్ని చూసి, అతను మానసికంగా ఎంతగా అప్‌సెట్ అయ్యాడో అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తోంది రాజీవ.


ఇందాకటి బేలతనం లేదు ఆమెలో ఇప్పుడు. ఆమెకు అర్థం కానిదల్లా ఒక్కటే, ఇంత పెద్ద అనుమానం ఈ మనిషికి ఇంత సడన్‌గా ఎందుకొచ్చిందాని.

ఆలోచనలో పడి మౌనంగా వుండిపోయిన భార్యని చూసి మరింత ఆవేశంగా అన్నాడు రామేశం. ''చెప్పు రాజీ! నీకు కృష్ణ అనేవాడితో సంబంధం వుందా లేదా?'' దాదాపు అరచినట్టుగానే అడిగాడీసారి.

''లేదు లేదు. నాకెవ్వరితోనూ ఏ సంబంధం లేదు'' సహనం చచ్చిన ఆమెలో ఆవేశం కట్టలు తెంచుకోగా



## 'రచన' తిరుగుటపాలో



ఒక్కోసారి ఒక్కో హీరోయిన్ చిన్న రాంగ్‌స్టెప్‌తో తన కెరీర్‌ని తనే నాశనం చేసుకుంటుంది. ఆమధ్య రమ్యకృష్ణ ఇలాంటి రాంగ్‌స్టెప్‌తోనే ఓ ప్రముఖ దర్శకుడి పేషీ నుండి బయటపడి, ఎదురుదెబ్బలు తిని, చివరికి బుద్ధి తెచ్చుకుని తిరిగి ఆ దర్శకుడి చెంతకే చేరింది. ప్రస్తుతం రచన అలాంటి రాంగ్‌స్టెప్‌తో తన కెరీర్‌ని దెబ్బతీసుకుందని ఫిల్మ్‌నగర్ బోగట్టా. రచన ప్రస్తుతం యస్వీ కృష్ణారెడ్డి 'అభిషేకం' చిత్రంలో నటిస్తోంది. ఆమె ఆ చిత్రంలో నటించడం ఆమెను తెలుగుతెరకు తీసుకువచ్చి జయాపజయాలతో సంబంధం లేకుండా వరుస అవకాశాలతో నిలబెట్టిన దర్శకుడికి ఇష్టం లేదట. అయితే ఆమె తనకు మాట మాత్రంగానయినా చెప్పకుండా ఆ చిత్రం ఒప్పేసుకోవడం ఆయనకు బాధ కలిగించిందట. లేకపోతే ఆయన ప్రస్తుతం తీస్తున్న ఓ చిత్రంలో 'రాశి' నటిస్తున్న కేరక్టర్‌కి మొదట 'రచన'నే అనుకున్నారట. ఏదేమయినా రచనకు ఆ దర్శకుడి చిత్రాలలో ఇకమీదట స్థానం వుండబోదని ఆ దర్శకుడి నైజం తెలిసినవాళ్లు అంటున్నారు... కాబట్టి, రచనకు మరో ప్రముఖ దర్శకుడెవరయినా 'చేయూత' నివ్వకపోతే ఆమె కెరీర్ అంతే సంగతులు!

- జె.వి.బాబు

ఏడుపొక్కటే తక్కువగా చెప్పిందామె.

"మరయితే కృష్ణ ఎవరు?" వెంటనే వచ్చింది మరో ప్రశ్న.

"ఏ కృష్ణ?"

"ఏ కృష్ణో నువ్వే చెప్పాలి. ఎన్నో కృష్ణుడో కూడా నువ్వే చెప్పాలి" అంటూ జేబులో వున్న ఉత్తరాన్ని ఆమెకందించాడు.

రాజీవ దానివంక సంభ్రమంగా చూసింది.

అపనిందకో సాక్ష్యం!

వణుకుతున్న చేతులతో ఆమె దాన్ని అందుకుంది. ఆ ఉత్తరం చదవడం ముగించిన ఆమె నెమ్మదిగా తలెత్తి అతని మొహంలోకి చూసింది.

దీనికి నీ సమాధానమేమిటన్నట్టు ఆమెవైపే చూస్తున్నాడు రామేశం.

"కృష్ణ, నేను కాలేజీలో మంచి స్నేహితులం. మేమిద్దరం కలసి ఎన్నో సినిమాలు, షికార్లకి తిరిగిన మాట నిజం."

ఒంటిమీద తేళ్లూ, జెర్రెలు పాకినట్లయింది రామేశానికి.

అంటే...అంటే...తన భార్య నిజంగానే ఎఫైర్ నడిపిందన్నమాట. తను నిజంగానే పూర్ఫెలో అన్నట్టుగా మనసు వెక్కిరించింది.

చెప్పడం ముగించిన ఆమె తనముందే దోషిలా తల దించుకుని నిలబడడాన్ని భరించలేకపోతున్నాడు రామేశం.

"నువ్వు రేపే మీవాళ్లింటికి వెళ్లిపో రాజీ. ఆ తరువాత నెమ్మదిగా డైవర్స్‌కి అప్లయ్ చేద్దాం"

చివుక్కుమంది ఆమె మనసు.

ఆడదాని విషయంలో ఎంత తొందరగా ఓ నిర్ణయానికొచ్చేస్తాడు మగవాడు!

"ఒకవేళ నేను వెళ్లిపోయాక, నేను నిర్దోషినని తేలితే ఏం చేస్తారు?" అడిగింది రాజీవ.

జీవం లేని నవ్వు నవ్వాడు. "దోషినని నువ్వే ఒప్పుకున్నావుగా!"

"నేను ఒప్పుకోలేదే!"

"అంటే?"

"అంటే ఏముంది. కృష్ణ అంటే...అది నా గర్ల్‌ఫ్రెండ్"

"ఆ!" ఆశ్చర్యంతో నోట మాట రాలేదు రామేశానికి.

"ఔనండి! వాళ్ల అమ్మ, నాన్నలకి ఒక్కగానొక్క కూతురు. ఇంట్లో ముద్దుగా 'కృష్ణ' అని పిలిచేవారు. ఆ పేరే ఇంటా బయటా స్థిరపడిపోయింది. ఆమె పూర్తి పేరు 'కృష్ణప్రియ'. మీకొచ్చిన ఉత్తరంలో కూడా కృష్ణ అని వుండడంతో, వీడెవడో నా బోయ్‌ఫ్రెండ్ అనుకుని, వాడితో నేనేదో ఎఫైర్ నడిపేశాననుకొని, మీలో మీరే ఏవేవో ఊహించేసుకుని ఇంత రాద్ధాంతం చేశారు.

సాక్ష్యం కావాలంటే ఈ ఫోటో చూడండి" అంటూ మంచం కింద సూట్‌కేసులో వున్న ఫోటో బయటకు తీసింది.

కాలేజీ చదువు పూర్తవుతున్న సందర్భంగా ఫేర్‌వెల్ పార్టీలో క్లాసంతా కలిసి తీయించుకున్న గ్రూప్‌ఫోటో అది.

"ఇదిగో, ఇక్కడ నా ప్రక్కనున్నదే కృష్ణ...కాదు కాదు...కృష్ణప్రియ. చూడండి" అంటూ చేతికందించింది ఆ ఫోటోని.

పొడుగ్గా వున్న ఆ అమ్మాయిని చూశాడు. కింద రాసివున్న పేర్లలో ఆమె పేరు కూడా వుంది.

కట్టుకున్న భార్యని గురించి తక్కువగా ఊహించుకున్న తన కుసంస్కారానికి సిగ్గుతో తల దించుకున్నాడు రామేశం.

ఏది ఏమైనా భార్యపై ఏ నిందా లేనందుకు పరమానందంగా వుందతనికి.

అగ్నిప్రవేశం చేసిన ఓ అగ్నిపునీతలా కనిపిస్తోందామె.

"నిన్ను చాలా బాధపెట్టాను. అయామ్ సారీ రాజీ!"

చివ్వున తలెత్తింది ఆమె. కళ్లలో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి. ఆమె కన్నీళ్లు చూసి కలత చెందిన రామేశం మళ్లీ అన్నాడు. "ప్లీజ్ రాజీ. నన్ను క్షమించవూ"

"నన్ను ఇంతగా అనుమానించారనే నా బాధంతా. నాపై మీరు మోపిన నిందలన్నీ అపనిందలేననడానికి సాక్ష్యం ఈ ఫోటో.

ఈసారికైతే గండం గట్టెక్కింది. కాని రేపు...నీ కడుపులో పెరుగుతున్న బిడ్డకి తండ్రిని నిజంగా నేనేనా? అని మీరు అడిగితే చూపించడానికంటూ ఏ సాక్ష్యం లేనిదాన్నండీ నేను. అంతటి అవమానభారాన్ని మోసే శక్తి కూడా నాకు లేదు" భోరున ఏడ్చేసింది రాజీవ.

ఆమె హృదయం ఎంతగా బాధపడిందో అర్థం చేసుకున్న రామేశం రాజీవను దగ్గరగా తీసుకున్నాడు ఓదార్పుగా.

"పెళ్లి అనే పునాదిపై ఏర్పడ్డ వైవాహిక జీవితంలో ఆనంద సౌధాలు నిర్మించాలంటే కావలసినవి పరస్పర అవగాహన, నమ్మకం. అవి లేని జీవితాలు దుర్భరం."

వివాహ వ్యవస్థ మీద తను ఎప్పుడో చదువుకొన్న వాక్యాలు స్ఫురణకు రాగా, అంతర్మథనంతో రాజీవకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పుకున్నాడు రామేశం.

★

